# పదునైదవ ప్రసంగము

ఒకప్పుడు శ్రీప్రకాశానందస్వామివారు రాజకోటనుండి పీఠడియా వెళ్ళదలచిరి. ఇది తెలిసికొని త్ర్యంబకభాయి, జయంతీభాయి మేముకూడ వచ్చెదమనిరి. స్వామివారి అనుమతితో వారుకూడ వెంబడించిరి.

ప్రకాశానందస్వామివారు జయంతీభాయిని నిత్యానందస్వామి వారికి పరిచయము చేయుచు ఇట్లనిరి. "ఈయన డాక్టరు. క్షయవ్యాధి వచ్చునను భయముతో నున్నారు. కాని ప్రస్తుతము బాగుగనే ఉన్నారు. దయయుంచి వీరికి ఏమైన చెప్పుడు."

## సద్భావముచే కలుగు లాభము.

స్వా. ని.:— "భావము ప్రధానము. సద్భావము కలిగియుండుడు. నేను రోగిష్ఠివాడను, బాధగా ఉన్నది అనుకొనుచు ఉన్నచో ఇంకను ఎక్కువగా బాధ కలుగును. గాన రోగము నయమైనదను సద్భావము కలిగియుండుడు."

జయంతీ:— తమకృపవలన నాబాధ తగ్గిపోయినది. నాకేమి బెంగలేదు. నాకు చాలకాలమునుండి మరొకరోగము కలదు. దానిని పోగొట్టుడు.

స్వా. ని:— ఆ మరొకరోగ మేమి?

## మనస్సును నిలబెట్టిన కలుగు లాభము.

జయంతీ:— నామనస్సు ఎంతయో చంచలముగా నున్నది. దానిని నిలబెట్టుటకు వలయు చికిత్స చెప్పుడు. నామొర ఆలకించుడు.

స్వామినిత్యానందులవారు ప్రకాశానందులవారిని సమాధానము చెప్పుమనిరి.

స్వా. ప్ర॥:— నాతో ఎక్కువ సాన్నిధ్యము ఉన్నందున నమ్మకము తక్కువగా నుండును. తమరే ఏమైన చెప్పుట యుక్తము.

స్వా. ని:— తమతో ఎక్కువ సాన్నిధ్యము ఉన్నచో రోగ నిదానము తమరే బాగుగ చేసిఉందురు. కావున ఔషధము చెప్పు భారముకూడ వహించుడు.

స్వా. ప్ర:— (జయంతీభాయిని ఉద్దేశించి) మనస్సును నిల బెట్టవలసిన ప్రయోజనము నీకేమి కలదు?

*ప్రయోజనసంప్రవృత్తేః కారణం ఫలలక్షణమ్।*
*ప్రయోజనమనుద్దిశ్య న మన్దోఽపి ప్రవర్తతే॥*

"కార్యప్రవృత్తికి కారణము ఫలవిజ్ఞానము. ప్రయోజనము లేనిదే మూఢుడుకూడ కార్యమునందు ప్రవర్తించడు."

ఫలజ్ఞానము కలుగువరకు కార్యమునందు మనఃప్రవృత్తి కలు గదు. ఫలాన దేశములో ఫలానరకపు వ్యాపారము చేసినచో కొద్ది కాలములో చాలలాభము కలుగును అని తెలిసినచో మానవుడు తనవద్ద మూలధనము లేకపోయినచో, అప్పుతెచ్చియో, ఇల్లైన అమ్మియో ఆవ్యాపారముచేసి, అనేకకష్టములను అనుభవించి అయి నను ధనమును సంపాదించును. ఇప్పుడు చాలమంది ధనముకొరకు కర్మల నాచరించుచున్నారు. మాయాజన్యసుఖములకు సాధనము ద్రవ్యమగుటయే ఇందుకు కారణము. అటులనే ద్రవ్యముచే కలుగు ఫలితము వారికి తెలిసినందున ద్రవ్యముద్వారా సుఖమును పొందు టకు ప్రయత్నము చేయుచున్నారు. మనస్సును ఆపుటచే మీకు కలుగు ప్రయోజనమేమి?

జయంతీభాయి:— పరమాత్మను లభించుటయే ప్రయోజనము.

## పరమాత్మని అస్తిత్వము.

స్వా. ప్ర:— అయితే మీరు పరమాత్మ ఉన్నాడని అంగీకరించుచున్నారా? నేటి ఇంగ్లీషుచదువులు చదివినవారు ప్రకృతి నే అంగీకరించెదరు. మాసైన్సులో ఈశ్వరుడనెడు పదార్థము ఏదియును లేదనెదరు.

జయంతీ:— నేను మెడికలుకాలేజికి వెళ్ళినప్పుడు మొదట దేవుడు ఉన్నాడా లేడా అను విషయము ఆలోచించలేదు. కాని అక్కడ శవములను కోయుచున్నప్పుడు పెద్దడాక్టర్లు మెదడును చూపించి అందలి జ్ఞానానాడులను చూపి వీనియందు ఎంతజ్ఞానము ఉన్నదియును ఎవరును ఎరుగరు. దేవుని అగాధసృష్టివైచిత్ర్యమును ఇవి ప్రకటించును. ఎంత నాస్తికుడైనను వీనిని చూచిన దేవుని అస్తిత్వమును అంగీకరించవలసి వచ్చును అని చెప్పిరి. అనంతరము నాఆరోగ్యమును పరీక్షింపజేయించుకొనుటకు సివిలుసర్జను 'హూటను'దగ్గరకు వెళ్ళితిని. ఆయన పరీక్షించినపిదప ఇట్లు పలికెను. "జయంతీలాల్! పరీక్షించు డాక్టరు, రోగి, ఈఇరువురిమధ్యను మూడవశక్తి ఏదియో పనిచేయుచున్నది." ఇట్లు నాకు దేవునిపై నమ్మకము కలిగినది. స్వర్గనరకములను, బంధమోక్షములనుకూడ నేను అంగీకరింతును. కావున నామనస్సు విషయముపైపునకు ఎక్కువగా పరుగిడును.

## ధనమునకును దైవభక్తికిని ఎడమ.

స్వా: ప్ర:— నీకు దేవునిపై నమ్మకము ఉన్నచో ధనము సంపాదించుటకు ఇంత శ్రద్ధ ఎందుకు చూపుచున్నావు? అన్నపానాదులను ఇచ్చుచున్న దైవముపై అంత శ్రద్ధ లేదేమి?

జయంతీ:— నమ్మకము కలదు. కాని ఎక్కువ ప్రయత్నము చేయవలెనుగదా! పళ్ళెములో అన్నము ఉన్నను చేతితో తినిన తరు

వాతనే కడుపు నిండును. అదేవిధముగా ప్రియత్నించనిదే ఏమియు లభించదు.

స్వా. ప్ర:— ఆప్రయత్నము చేయవద్దని ఎవరన్నారు? కాని త్వరలో గొప్ప ధనవంతుడవు అయిపోవలెనను కోరిక కలిగినది. మరి ప్రియత్నము ధనముకొరకు చేయుచున్నావు. మాటలు దేవునికొరకు చెప్పుచున్నావు.

జయంతీ:— డబ్బులేనిదే రోజెట్లు గడచును?

స్వా. ప్ర:— రోజు గడపుకొనుటకు ప్రియత్నము చేయుటలో తప్పులేదు. కాని చాలధనము లభించవలెనని నీకోరిక.

జయంతీ:— అయినను తప్పేమి కలదు? చాలధనము లభించినచో ధర్మకార్యములు చేసెదను.

## అంధత్వమును పోగొట్టుకొనుటకు దారిద్ర్యమను అంజనము.

స్వా. ప్ర:— ధనమునకును దైవభక్తికిని స్నేహము లేదు. ధనము మానవుని దుష్ప్రవర్తనకు దారితీయించును. ఎక్కువధనము అవినీతిచేతనే దొరకును. గొప్పగొప్ప ధనవంతులు అందరు వేలకొలది దరిద్రులను బాధించి, వ్యాపారములో కల్తీ, మోసము చేసి, నౌకరులకు పూర్తిగా జీతములను ఈయక, అన్యాయముగా ధనము సంపాదించి ధనవంతు లగుచున్నారు. అట్టి జనులకు ధర్మమో, అధర్మమో తెలుపునట్టి వివేకరూపమగు నేత్రము ఉండదు. కావున వారు అధర్మమార్గముననే నడచుదురు. ఇట్టివారినిగురించియే శంకరాచార్యులవారు పలికిరి:-

*సంపన్నోఽన్ధవదేవ కించిదపరం నో వీక్షతే చక్షుషా*
*సద్భిర్వర్జితమార్గమేవ చరతి ప్రోత్సాహితో బాలిశైః।*
*తస్మిన్నేవ ముహుః స్ఖలన్ ప్రతిపదం గత్వాన్ధకూపే పత*
*త్యస్యాన్ధత్వనివర్తకౌషధమిదం దారిద్ర్యమేవాఞ్జనమ్॥*

"ధనవంతుడు గ్రుడ్డివానివలె కండ్లతో దేనిని చూడడు. బుద్ధిహీనుల ప్రోత్సాహమున సన్మార్గులు విడచిన మార్గముననే సంచరించును. దానిపైననే నడచి నూటిమాటికి దెబ్బలుతిని చివరికి చీకటి నూతిలో పడును. వాని అంధత్వమును పోగొట్టు ఔషధము దారిద్ర్యమను అంజనమే."

అంధుడు ఏపదార్థమును చూడలేడు. అటులనే ధనవంతుడు "ఈప్రపంచము ఏమి? ఇచ్చటకు వచ్చి ఏమిచేయవలెను? ప్రపంచమున దుఃఖపడువాడు ఎవడు? సుఖించువాడు ఎవడు? ధనమును ఎట్లు ఉపయోగించవలెను? దరిద్రునిపట్ల ధనవంతుని ధర్మమేమి! మొదలగు విషయములను ఆలోచించడు. తనకు ఎట్లు ఎట్టివివేకమును ఉండక పోవుటచే మూర్ఖులకుకూడ ఆతడు "మీదగ్గర ఉన్న ధనమును, ఎందుకు పడితే అందుకుఖర్చుపెట్టరాదు. మీకొరకై ఉపయోగించవలెను. సుఖమును, భోగములును అనుభవించుడు. అది తప్ప ఈప్రపంచమున మరి ఏమికలదు?" ఇట్టి ఉపదేశములచే సత్పురుషులు విసర్జించిన తప్పుదారికే త్రోయుదురు. అసన్మార్గమున దెబ్బలు తినుచు, తమ గౌరవప్రతిష్ఠలకు భంగము కలిగించు పనులను చేయుచు ఆపదలలో చిక్కుకొనెదరు. ఈలోకమునందును, పరలోకమునందును ఎంతయో దుఃఖము కలిగించు అధర్మమనెడు కూపమునందు పడిపోవుదురు. ఆఅంధత్వమును పోగొట్టుటకు దారిద్ర్యమను అంజనమే ఉత్తమౌషధము

ఈదారిద్ర్యమున సామాన్యజనులు తమ నిర్ధనత్వమునకు దుఃఖింతురు. "నేను బాధపడుచున్నాను. దరిద్రుడను. దిక్కులేని వాడను." అని దైన్యముతో దుఃఖమును ఆహ్వానించుదురు. దారిద్ర్యమును తమంతట తామే స్వీకరించిన మహాపురుషులు మహారాజులను, శ్రీమంతులను దరిద్రులనుగా తలతురు. వారికంటె తామే ఎక్కువ సుఖమును, సంతోషమును అనుభవింతురు. వారి దృష్టి

యందు దారిద్ర్యము, మట్టి సమానముగా నుండును. నిష్కాములగుటచే వారు ఎట్టి ఆశను కలిగియుండరు. పూర్వకాలపు ఋషులు సమర్థులగుటచే నిర్ధనావస్థయందే ఉండెడివారు. అందే వారికి సంతోషము కలిగెడిది. వారు బ్రహ్మత్వమునే కోరెడివారు. ఆబ్రహ్మత్వమునకు ఎదుట ఇంద్రవైభవముకాని, కుబేర సంపత్తికాని వారికి తుచ్ఛమైనదే.

ఒకరోజున కబీరు దర్శనమునకు ఒక సంతు మహాపురుషుడు వచ్చెను. ఆసమయమున కబీరు బట్టలు నేయుచుండెను. కబీరు ఇట్లు శ్రమపడుచుండుటయు, గృహపరిస్థితి సామాన్యముగ నుండుటయును చూచి ఆయన ఇట్లు తలచెను. ఈయన జీవితము గడుపుకొనుటకు వలయు ధనసహాయము చేసినచో బ్రతికి ఉన్నంతకాలము దేవుని స్మరించును. ఇట్లు తలచి ఆయన కబీరుతో పలికెను. "ఇంటియందు కొంచెము రాగియున్నచో ఇచ్చెదరా?"

కబీరు:—"రాగి తీసికొనివచ్చుటకు నాదగ్గర ధనము లేదు. ఇంటిలో ఒక రాగిపాత్రము ఉన్నది స్వీకరించుడు." అని కబీరు ఆ పాత్రను తీసికొనివచ్చి ఇచ్చెను. ఆ మహాపురుషుడు వనములోనికి వెళ్లి ఓషధుల సహాయముచే ఆరాగిపాత్రను రెండుమూడు రోజులలో బంగారుపాత్రగా మార్చెను. అది కబీరునకు సమర్పించుచు ఇట్లనెను. "దీనితో కావలసిన పదార్థములను కొనుక్కొనుడు. ఇంకను రాగి తీసికొనివచ్చినచో ఇంకను బంగారము చేసి ఇచ్చెదను. దీనివలన తమకు దైవభక్తికి చాలసమయము మిగులును. ఇది విని కబీరు నవ్వుచు ఇట్లనెను.

మహానుభావా! ఇట్టి బంగారుచేత నాకుకూడా తెలుసును. కాని ఇట్లు బంగారము చేసికొని దానితో జీవించుట మనకు ధర్మము కాదు. నాకు దైవభక్తియందుతప్ప మరెట్టి ప్రక్రియయందును ఇష్టము లేదు. ఇట్టి ప్రక్రియలలో పడినచో నేను దైవమునకు దూర

మగుదును. ఇట్లు పలికి మరియొక రాగిపాత్రను తెచ్చి క్షణములో ఆనంతు చూచుచుండగనే బంగారు పాత్రగా మార్చి వానియెదుట పెట్టి నేజేయు ప్రక్రియలన్నియు భగవచ్చరణములందే సమర్పితములు కావలెను. ఇదిచూచి ఆనంతు సిగ్గుపడెను.

## బైబిలునందు ఉపదేశించబడిన ధన నిషేధము

బైబిలునందుకూడ ఇట్లున్నది:—

ఒక ధనవంతుడు జీససుదగ్గరకు వచ్చి చెప్పెను, "ఓఉత్తమోపదేశకుడా! అనంతజీవితమును పొందుటకు నేను ఏమి చేయవలెను?"

జీససు:—"నీవు నన్ను ఉత్తముడనుగా తలచుచున్నావా? దేవుడుతప్ప మరెవ్వడును ఉత్తముడు కాడు. నీకు దేవుని ఉపదేశములు తెలుసునుకదా! "వ్యభిచరించకుము. హత్యలు చేయకుము. దొంగతనము చేయకుము. అబద్ధపు సాక్ష్యము పలుకకుము నీతల్లి దండ్రులను గౌరవించుము."

ధనవంతుడు:—ఇవి అన్నియును నేను చిన్నతనమునుండియు చేయుచున్నాను. అది విని జీససు అతనితో ఇట్లనెను.

జీసీసు :—అయితే ఇంకను ఒకలోపము కలదు. నీధనమంతయు దరిద్రులకు ఇచ్చివేసి నాతోకూడ రమ్ము. దేవుని రాజ్యములో ప్రవేశించుట అనగా సూదిబెజ్జములోనుండి ఒంటెను పోనిచ్చుటవంటిది.

## ధనముచే కలుగు బాధలు.

పారసభాగమున ధనముచే కలుగు బాధలు వివరించబడినవి—

"ధనము ఉండగా విరక్తి కలుగుట కష్టము. మనస్సు అసలే చంచల మయినది. ధనము లభించుటతోడనే భోగములు— అనగా పాపకృత్యములు సులభముగా చేయనగును. అంతట బుద్ధి నశించును,

వివేకమున్నచో పాపభయముచే రక్షణను పొందును. కాని అన్నపానాదులు, వస్త్రాలంకారాదులు మొదలగువానిని విడనాడలేడు; సంపదలో సంయమము, వైరాగ్యము మహాదుర్లభము. సంపదయుండుట భోగప్రాబల్యము ఎక్కువగ నుండును. సంసారమే స్వర్గమని తలచి పరలోకవిముఖుడగును. ఇట్లు అరజోగుణబీజమునుండి తమోవృత్తి జన్మించును. ధనవంతుడు ఒకవేళ పాపములనుండి విముక్తిని పొందినను, ఎల్లప్పుడు వైరాగ్యముతోనుండి వివేకముతో ధనవ్యయము చేయుచున్నను ధనరక్షణయందు నిమగ్నుడగును. భజనకాని, అభ్యాసముకాని చేయడు. జలమునందు ఉండి తడియకుండ ఉండుట అసంభవము. కావున సత్పురుషులు వివేకముతో జీవితనిర్వహణమునకు అవసరమగు నిష్కల్మష ధనసంగ్రహము అమృతమువంటిది అనియు, అందుకు సందేహము లేదనియు నిశ్చయించిరి. ఆహారము, వస్త్రములు, ఉనికి ధనముచే లభించును. కావున శరీరనిర్వహణకు అవసరమగు ధనమును మాత్రము సంపాదించవలెను.

## నిజమగు నిర్ధనత్వము పరమవైరాగ్యము.

ఉదారులగు శ్రీమంతులకంటె సంతోషశీలుడగు నిర్ధనుడు ఉత్తముడు. ఏలనన అతడు మాయనుండి విరక్తినిపొంది దేవునియందు ఎక్కువప్రేమను కలిగియుండును. మృత్యుసమయమున నిర్ధనునకు మాయికపదార్థములయందు ఆసక్తి ఉండదు. భగవంతునియందు భక్తి కలుగును. ధనవంతుడు ఉదారుడయినను, సాత్త్వికుడయినను అనేకవిధములగు సుఖములను అనుభవించుటచే అతని ఆసక్తి మాయనుండి మరలదు. అతిథులకొరకు ధనమును వ్యయముచేయుచు నిష్కామిగానుండు ధనవంతుడు ఉత్తముడని చెప్పవచ్చును, కాని అట్లు ఉండుట సుకరమయినచో కొందరు మహాత్ములు, మహారాజులు రాజ్యములను ఏల త్యజించియుందురు? సత్యాసత్య

షుల రెండిటియందును ఒకేమారు ప్రేమ కలుగదు. నిర్ధనత్వమే అన్నివిధములను ఉత్తమమైయున్నది. నిర్ధనత్వము సాఫల్యము నొందగనే అతడు ఎల్లవేళల సంతోషముతో నుండును. తన దుఃఖములను ఇతరులచెంత వెల్లడించడు. భగవానుడు తన ప్రియాతిప్రియునకే, నిర్ధనత్వమును కలుగజేయునని తెలచును. సంతుష్టుడగు నిర్ధనునే భగవానుడు ఎక్కువ ప్రేమించును. కావుననే మహాత్ములగు తనభక్తులతో ఆతడు ఇట్లు చెప్పెను:— "నీవు నిర్ధనుడవు అయి పరలోకమునకు పొమ్ము." నిజముగ నిర్ధనత్వ మనగా తన చెంతనున్న ధనమును సత్కార్యములయందు వ్యయపరచి నిర్ధనుడగుట. అదియే పరమ వైరాగ్యము.

జయంతీ:— అట్టి వైరాగ్యము తమవంటి త్యాగులకు లభ్యమగును. నేను సంసారము కలవాడను. డబ్బులేనిదే రోజు గడవదు. శాస్త్రములయందు ధర్మము, అర్థము, కామము, మోక్షము అనెడు పురుషార్థములు చెప్పబడియున్నవి. ధనములేనిదే ధర్మకార్యములు ఎట్లు జరుగును? కర్మకాండమునందు యజ్ఞము, దానము, తపస్సు చెప్పబడినవి. అందు యజ్ఞము, దానము ధర్మములేనిదే జరుగవుకదా!

స్వా. ప్రి:— నచికేతుడు యమునితో "న విత్తేన తర్పణీయో మనుష్యః" అని చెప్పెను. "ధనముద్వారా ఏమానవుడును తృప్తిని పొందడు."

సికందరుచక్రవర్తి తన రాజ్యములోనున్న ప్రజలందరదగ్గరను ఉన్న ధనమును అంతయును లాగికొనెను. ఇంకను ఎవరిదగ్గరనైనను ధనము ఉన్నదేమో తెలిసికొనవలెనని ఆతనికి తోచెను. ఆ ఉద్దేశ్యముతో ఆతడు ఒకబంతెను ఒకడబ్బుచొప్పున అమ్ముదునని రాజ్యమున దండోరా వేయించెను.

జనులకు బంతెను కొనవలెనని తోచెను. కాని దగ్గర ధనము లేనందున ఎవరును కొనలేకపోయిరి. ఒక బాలుడు బంతెను కొను

కొనుటకు వేడుక కలిగి తనతల్లిని ఒంటెను కొనుక్కొనుటకు ఒక డబ్బు ఇవ్వమని కోరెను. తల్లి చెప్పెను. "నాదగ్గర డబ్బులు లేవు. నీవు ఒంటెను కొనుక్కొనవలెనని అనుకొనుచున్నచో నీతండ్రిసమాధి యందు ఒకడబ్బు పారవేయబడి ఉన్నది. త్రవ్వి తీసుకొనుము." బాలుడు అటులనే చేసి ఒంటెను కొనబోయెను. సికిందరు ప్రశ్నించగా సమాధినుండి సంపాదించినట్లు చెప్పెను. వెంటనే సికిందరు సమాధులను అన్నిటిని త్రవ్వించి వానియందలి ధనమునుతీసికొనెను.

ఈ మహాచక్రవర్తి మృత్యుసమయమున ఇట్లు ఆలోచించెను. "ఈఅనంతద్రవ్యరాశులను, ఏనుగులను, గుర్రములను, వాహనములను, నౌకరులను, దాసదాసీజనులను, రాణీలను, స్త్రీజలనుండి సంపాదించిన ధనమును మొదలగునవి అన్నియు విడచి నేను ఒంటరిగానే మృత్యుముఖమున పడవలసివచ్చుచున్నది."

ఇట్లు ఆలోచించి తాను చనిపోయినతర్వాత తన రెండుచేతులను అందరికి కనబడునట్లు ప్రక్కలకు వ్రేలాడునట్లు చేయ నాజ్ఞాపించెను. తాను రిక్తహస్తములతోనే పుట్టి రిక్తహస్తములతోనే ప్రపంచమునుండి వెళ్లిపోవుచున్నట్లు జనులకు తెలియజేయునట్లుగా తన శరీరము చేతులను బహిరంగము చేయునట్లు ఆజ్ఞాపించుటలో అతని ఆంతర్యము తెలియచేయబడినది. అంతేకాదు. నాతాలూకు అనంతధనసమృద్ధి, పుష్కలసైన్యము, ఆప్తబంధువులు, వైద్యరాజులు మున్నగువారు ఎవరున్ను మృత్యుముఖమునుండి నన్ను కాపాడలేకపోయిరి. వీరందరిని విడచి నేనొంటరిగానే మృత్యుముఖమున గ్రాసముగుచున్నాను.

ఇట్లు అనేకమంది మహాత్ముల జీవనచరిత్రములు వారి అనంతైశ్వర్యములు నిరర్థకములని ఘోషించుచుండ,ఆదృష్టాంతములవలన జ్ఞానము పొందకుండుట దౌర్భాగ్యముతప్ప వేరుకాదు.

పతంజలి యోగసూత్రములయందు ఇట్లు చెప్పెను.

*సంతోషాదనుత్తమః సుఖలాభః।*

"సంతోషముచే పరమోత్తమమగు సుఖము కలుగును." కావున జీవితనిర్వాహణమునకు వలయు ద్రవ్యమును పొందినవెంటనే సంతోషమును అనుభవించవలెను. మీకు జీవితము గడపుకొనుటకు వలయు ద్రవ్యము లభించియుండ ఎక్కువద్రవ్యము ఏమి అవసరము?

## మోక్షమునకు నలుగురు ద్వారపాలురు.

స్వా॥ని॥:—ప్రకాశానందస్వామివారు చెప్పినది యథార్థమే. సంతోషము మోక్షద్వారపాలురలో నొకటి.

*మోక్షద్వారే ద్వారపాలాః చత్వారః పరికీర్తితాః।*
*శమో విచారః సంతోషః చతుర్థః సాధుసంగమః॥*

(యోగవాసిష్ఠము)

"మోక్షద్వారమునకు ద్వారపాలకులు నలుగురు. శమము, తత్త్వవిచారము, సంతోషము, సాధుసంగమము" అని శాస్త్రములు చెప్పుచున్నవి.

### శమః.

*సదైవ వాసనాత్యాగః శమోఽయమితి శబ్దితః।*

"నిరంతరవాసనాత్యాగము శమమని చెప్పబడుచున్నది."

శమమనగా మనోనిరోధము. సంకల్ప,వికల్ప వృత్త్యాత్మకమగు మనస్సును విషయములనుండి నిగ్రహించుట. సంకల్ప, వికల్పములకు అనాదియగు అజ్ఞానముచే జనించిన వాసనయే కారణము. వాసనావశముననే సంకల్పవికల్పములు కలుగును. ఈవాసననుండి ముక్తిని పొందమని యోగవాశిష్ఠమున" చెప్పబడినది:—

*అసంగవ్యవహారిత్వాత్ భవభావనవర్జనాత్ ।*
*శరీరనాశదర్శిత్వాత్ వాసనా న ప్రవర్తతే ॥*

"నిస్సంగత్వముతో నుండుట, ప్రపంచమునందు మమత్వ బుద్ధిని విడనాడుట, శరీరముయొక్క నశ్వరత్వమును మాటిమాటికి విస్మరించకుండుట— వీనిచే మలినవాసనలు జనించవు."

కావున కారణమును నిరోధించుటద్వారా కార్యమును నిరోధించుడు. అనగా వాసనానిరోధముద్వారా సంకల్పవికల్పములను నిరోధించుట శమము.

## విచారః

*కోఽహం కథమిదం జాతం కో వై కర్తా చ విద్యతే।*
*ఉపాదానం కిమస్తీహ విచారః సోఽయమీదృశః ॥*

నేను ఎవడను? ఈజగత్తు ఎట్లు ఉద్భవించినది? దీనికి కర్త ఎవడు? దీనికి ఉపాదానకారణమేమి? ఈనాలుగు పదార్థములకు సంబంధించిన భావములే విచారము.

*కోఽహమ్* :— "నేను ఎవడను?" ఈ ఆలోచన ముముక్షువు ఎల్లప్పుడు చేయును. ఈభావము పరిపక్వమగుటతోడనే "నేను ఈ దృశ్యజగత్తునకు భిన్నుడను." అనగా దేహము, ఇంద్రియములు, ప్రాణములు, మనస్సు, బుద్ధి, ఘటాదులు మొదలగువాని కంటె నేను భిన్నమైనవాడను. సర్వసాక్షిని. ఇట్టిజ్ఞానముకలుగుట "కోఽహం" భావముయొక్క ప్రయోజనము.

*కథమిదంజాతమ్* :— "ఈ దృశ్యప్రపంచము ఎట్లు ఉద్భవించినది?" ఈవిషయముయొక్క విమర్శనలో పరిపక్వము చెందినకొలదియు తాను ఇట్లు తలచును.

"మాయావిశిష్టమగు బ్రహ్మము జీవజాతముయొక్క శుభాశుభ అదృశ్యములగు ఫలములను దృష్టినిడుకొని "ఏకోఽహం బహుస్యామ్" అను సంకల్పమును పొందెను. అంతట ఆమాయావిశిష్టబ్రహ్మమునుండియే ఆకాశాది జడపదార్థముల జగత్తు ఉద్భవించినది. ఆ జగత్తు నాకంటె భిన్నమైనది."

కో వై కర్తా చ విద్యతే:—"దీనికి కర్త ఎవడు?" ఈభావన పరిపాకమును చెందినంతనే అతర్క్యము, అచింత్యము అగు జగద్రచన అల్పశక్తిమంతుడగు జీవుడు చేయలేడు. సర్వజ్ఞుడును, సర్వశక్తివిశిష్టుడును అగు ఈశ్వరుడే మాయాశక్తివశమున జగత్తును సృజించెను అని తెలియును.

ఉపాదానం కిమస్తీహ:– "ఈజగత్తునకు ఉపాదానకారణ మేమి?"

ఈ భావనాపరిపాకమున అచింత్యము, అనిర్వచనీయమును అగు అవిద్య ఉపాదానకారణము అని తేలును. ఘటాదులకు కపాలాదులును, పటాదులకు తంతువులును ఎట్లు ఉపాదానకారణములో అటులనే జగత్తునకు ఉపాదానకారణము అవిద్య. ఈ అవిద్య నాయందు అధ్యస్తమయి ఉన్నది. దానికి అధిష్ఠానమగు సాక్షిని నేను. ఈ దివ్యమగు వివేకమే విచారము.

## సంతోషః

*సంతోషం పరమాస్థాయ సుఖార్థీ సంయమీ భవేత్।*
*సంతోషమూలం హి సుఖం దుఃఖమూలం విపర్యయః॥*

"పరమసంతోషమును పొంది సుఖమును అనుభవింపగోరు మానవుడు సంయమమును పాటించవలెను. సుఖమునకు మూలము సంతోషము. అసంతోషము దుఃఖమునకే కారణము."

ఈ విషయమున శ్రీమద్భాగవతమున ధర్మరాజునకు నారదుడు ఇట్లు చెప్పెను :–

*పణ్డితా బహవో రాజన్ బహుజ్ఞాః సంశయచ్ఛిదః।*
*సదసస్పతయోప్యేతే హ్యాసన్తోషాత్పతన్త్యధః॥*

"ఓ రాజా! విద్వాంసులు, వేదశాస్త్రాదులను, అధ్యయనము చేసినవారు, సంశయములను పోగొట్టువారు చాలమంది కలరు. సభాపతులుకూడ అనేకమంది కలరు. వారుకూడ అసంతృప్తిచే అధఃపతనమునుపొందుదురు."

## సా ధు స ం గ మః

"సాధ్నోతి పరకార్యమితి సాధుః" అని చెప్పిరి. "పర" శబ్దమునకు "పరులగు జనులనియును, పరలోకమనియునుకూడ అర్థము చెప్పవచ్చును. పరుల దుఃఖములను పోగొట్టువారు అనికాని, పరలోకముకొరకు, అనగా మోక్షముకొరకు ప్రయత్నముచేయువారు అనికాని సాధుశబ్దమునకు అర్థము. గృహస్థాద్యాశ్రమములయందు ఉండి ఆయా ఆశ్రమముల ధర్మములను యథార్థముగా పాలించువారు కూడ సాధువు లనబడుదురు.

వాయుపురాణ మేమనుచున్నదో వినుము.

*విద్యాయాస్సాధనాత్సాధుర్బ్రహ్మచారీ గురోర్హితః।*
*క్రియాణాం సాధనాచ్చైవ గృహస్థః సాధురుచ్యతే॥*

"గురువువద్ద విద్యాధ్యయనము చేయువాడు బ్రహ్మచారి. అతడుకూడ సాధువే. గృహస్థధర్మములను పాలించు గృహస్థుకూడ సాధువే."

*సాధనాత్తపసోఽరణ్యే సాధుర్వైఖానసః స్మృతః।*
*యతమానో యతిః సాధుః స్మృతో యోగస్య సాధనాత్॥*

అరణ్యమునందుకాని, గ్రామముబయటకాని ఉండి తపము చేయు వానప్రస్థాశ్రమికూడ సాధువనబడును. చతుర్థాశ్రమమునందు ఉండి పరమాత్మప్రాప్తికి సాధనములగు యోగసాధనాదుల ద్వారా ప్రయత్నించు యతికూడ సాధువనబడును. ఇట్లు ఆశ్రమ ధర్మములను యోగ్యముగా పాలించువాడు సదాచారులగు జనుల సమాగమముతో అసురసంపదలగు సర్వవిధదుష్కృత్యములను పరిత్యజించి సదాచారమును అనగా దైవసంపద అను ఫలమును శీఘ్రముగ పొందును.

శాస్త్రములు ఇట్లు ఘోషించుచున్నవి :—

సాధూనాం దర్శనం పుణ్యం తీర్థభూతాశ్చ సాధవః।
తీర్థం ఫలతి కాలేన సద్యః సాధు సమాగమః॥

సాధుదర్శనముచే పుణ్యము కలుగును. సాధువులు పుణ్యస్థలములు పుణ్యక్షేత్రములు చాలకాలమునకు ఫలమును ఇచ్చును. కాని సత్పురుష సమాగమము త్వరలో ఫలమును ఒసంగును.

## బీదలను పీల్చి ధనమును సంపాదించుట రాక్షసప్రవృత్తి.

స్వా॥ ప్ర॥ :—జయంతీభాయికి జీవితమును గడుపుకొనుటకు వలయు ధనము కలదు. అయినను సంతోషము లేదు.

పూర్వము వైద్యము, జ్యోతిషము మొదలగు కళలు పరోపకారము కొరకు ఉపయోగపడెడివి. ఏలఁన, పూర్వము ధాన్యము పుష్కలముగా పండుచుండెను. వానిని భుజించువారు తక్కువమంది ఉండిరి. కావున జీవితనిర్వాహణమునకు ఏ బాధయు కలిగెడిది కాదు. కాని, ఈరోజులలో ఆపరిస్థితులు మారుటచే జీవితనిర్వాహణమునకు సరిపోవునంత ధనము నార్జించుటలో బాధకము లేదు.

ఇప్పుడైనను లక్షాధికారిని అవవలెనను భావముతో బీదలను పీల్చి పిప్పి చేసి ధనమును సంపాదించుట పాపము. బీదలను పీల్చి పిప్పి చేయకుండ, అవినీతిని పొందకుండ, అధికధనవంతుడగుట అసంభవము. అక్రమపద్ధతులలో ద్రవ్యమార్జించుటకు అధికారము ఎవరికిని లేదు. భగవంతుడు మనుష్యులందరకును సమానాధికారములను ఇచ్చిఉన్నాడు. భగవంతుడు రాజునకయినను, ధనవంతునకైనను మూడుకళ్ళు నాల్గుచేతులును ఇయ్యలేదుకదా! బీదవానికి రెండు కళ్ళు, రెండు చేతులు—వీటిలో తగ్గింపు చేయలేదుకదా. అటులనే భోజనాదులుకూడ సమానమే. కావున తనకు ఎంత అధికారము ఉన్నదో తెలిసికొని ప్రపంచమున మెలగవలెను. తన హద్దుకు మీరి సంచరించువాడు దేవుని దండనకు పాత్రుడగును. నేటిపరిస్థితి

చూడండి. ప్రక్కనే ధనవంతుడు అవినీతిచే లక్షలు, కోట్లు సంపాదించి భోగవిలాసములలో మునుగుచు తేలుచు ఉండును. ఆప్రక్కనే లక్షలకొలది బీదలు 'అన్నమో రామచంద్రా' అనుచు ఆకలితో అలమటించుచుందురు. అయినను ఆధనవంతుడు వారిని లక్ష్యముచేయడు. అంతేకాదు. వారియందు తిరస్కారభావముకూడ కలిగియుండును. నైతిక సంపాదనముతో బీదలకు సహాయముచేయుట దైవగుణము. తన కడుపు నింపుకొనుటకే సంపాదించుట అసురవృత్తి ఇతరులను పీడించి సంపాదించుట రాక్షసవృత్తి.

శ్రీమద్భాగవతమున చూడుడు:—

*యావత్ భ్రియేత జఠరం తావత్ సత్త్వం హి దేహినామ్।*
*అధికం యోఽభిమన్యేత స స్తేనో దణ్డమర్హతి॥*

"ప్రతిప్రాణికిని కడుపునింపుకొను హక్కుకలదు. అంతకుఎక్కువ సంగ్రహించువాడు చోరుడు. దండనీయుడు."

## ప్రియముకాని హితమును చెప్పువాడును, వినువాడును దొరుకుట కష్టము.

ఇది విని నిత్యానందులవారు నవ్వుచు ఇట్లనిరి:—

మీరు ఇంతకఠినముగా చెప్పుచున్నను వారికి కష్టము కలుగుట లేదు.

*లభ్యతే ఖలు పాపీయాన్ నరోఽనుప్రియవాగిహ।*
*అప్రియస్య హి పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః॥*

(మహాభారతము)

"ఈప్రపంచమున అనుకూలములగు ప్రియవాక్యములను పలుకునట్టి పాపాత్ములు సులభముగా దొరుకుదురు. కాని అప్రియము, హితకరమును అగు విషయమును చెప్పువాడును, వినువాడును దొరకుట కష్టము" అని మహాభారతము చెప్పుచున్నది.

బ్రహ్మహత్యాదిమహాపాపములు చేయువారుకూడ స్వార్థము కొరకు జనులకు ఇష్టమగు మృదుభాషణములను పలుకుదురు. నిస్పృహుడుమాత్రమే హితకరమగు వాక్యములను పలుకగలడు.

## నిస్పృహత్వమునకు దృష్టాంతము.

కాశీలో స్వామీ భాస్కరానంద అను మహాపురుషుడు ఉండెడివారు. వారు కేవలము కౌపీనముమాత్రమే ధరించెడివారు. ఇల్లు అనునది వారికి లేదు. ఏచెట్టుక్రిందనో పడి ఉండెడివారు. ఒకప్పుడు ఒకగృహస్థుడు తనకు కుమారుడు కలిగిన స్వామివారికి విలువైన శాలువ ఇచ్చెదనని మొక్కుకొనెను. దైవకృపవలన ఆతనికి సంతానము కలిగెను. అంతట నాతడు అయిదువేలరూపాయిల విలువకల శాలువ తెచ్చి వారికి కప్పి పరుండపెట్టెను. ఆసమయమున ఒకరాజు అచ్చటికి వచ్చి త్యాగియొక్క లక్షణమేమని అడిగెను. స్వామివారు "మిమ్ములను గాడిదను సమానముగా చూచుట" అని సమాధానము చెప్పెను. రాజునకు కఠినముగా తోచి వెనుకకు మరలెను. కూడా ఉన్న దివాను ఇట్లడిగెను. "మహాప్రభూ, తమరు ఏల వచ్చిరి? ఏల వెళ్ళిపోవుచున్నారు?"

రాజు:— స్వామివారు నాకు ఇట్లు కఠినమగు జవాబుచెప్పిరి.

దివాను:- – స్వామివారు నిజమే చెప్పిరి. దాని అర్థము తమరు తెలిసికొనలేదు. పశు, పక్షి, మనుష్యాది ప్రాణుల అన్నిటియందును వారికి సర్వాత్మభావమే కలదు. నిస్పృహికాని దే అంత నిర్భయముగా సమాధానము చెప్పలేరు. అంతట రాజుగారు మరల స్వామివారిచెంతకు వచ్చి నమస్కరించెను. స్వామికి సాష్టాంగనమస్కారముచేసి, క్షమార్పణము కోరుకొని వారి ఉపదేశమును గ్రహించెను.
ఈస్వామివారివలె పూర్ణ నిస్పృహిమాత్రమే అంతనిర్భయముగా మాట్లాడ గలడు. శాస్త్రములో ఇట్లున్నది:—

ఉదారస్య తృణం విత్తం శూరస్య మరణం తృణమ్।
విరక్తస్య తృణం భార్యా నిస్పృహస్య తృణం జగత్॥

"ఉదారపురుషునకు ద్రవ్యము తృణమువలె తోచును. వీరునకు మృత్యువు తృణప్రాయము. విరక్తునకు భార్య తృణప్రాయము. నిస్పృహికి ప్రపంచమంతయు తృణప్రాయము." సంతృప్తితో నైతికముగ సంపాదించిన సంపాదనను పరోపకారమునకు వినియోగించుట గృహస్థుని ధర్మము.

ఇది విని జయంతీభాయి ఇట్లు ప్రశ్నించెను.

"అయితే నేను వృత్తి మూనివేయుదునా?"

స్వా॥ ప్ర॥ :—ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి:—

ద్వావిమౌ పురుషౌ లోకే శిరశ్శూలసమౌ మతౌ।
గృహస్థశ్చ నిరారమ్భో యతిశ్చ సప్రతిగ్రహః॥

ఈలోకములో ఏపనియును చేయని గృహస్థుడును, ప్రతిగ్రహమును చేయు యతియును తలనొప్పివంటివారు. కావున మీరు మీమీపనులు మూని ఇంటిలో నిర్వ్యాపారముగా కూర్చొనిఉన్నచో స్త్రీపుత్రాదులందరకును బాధను కలిగించెదరు. అటులనే నేను సన్యాసము తీసికొని ఇంటింటికి అడుక్కొనుటకు వెళ్ళినచో నావలన గృహస్థులకు బాధలు కలుగును. మీవైద్యవృత్తిని మీరు సాధించినచో మీస్వార్థముతోబాటు పరమార్థముకూడ సాధించవచ్చును. బీదలకు ధనము పుచ్చుకొనకుండ సేవ చేయవచ్చును. ఇది మహత్తమమగు పురుషార్థము. నీతిగా పనిచేసినచో దేవుడు నీయందు కృపజూపును. దొరకినదానితో సంతోషించుము.

స్వా. ని:— సంతోషము లేనిదే మానవునకు సుఖము కలుగదు. సంతోషము లేనిచో బుద్ధి నశించును. కావున సంతోషము కలిగి ఉండవలెను. నాకు తోచినట్లు నేను చెప్పుచున్నాను. వారే మనుకొనుచున్నారో నాకేమి తెలియును. వారి వయస్సు తక్కువ.

ఇప్పుడు బాగుగా ధనమును సంపాదించి, వృద్ధాప్యమును సచ్చింతతో దేవుని స్మరించవచ్చునని కూడ వారి ఆశయము కానచ్చును.

## బాల్యమునుండియు ఆత్మశ్రేయమునకు పాటుపడవలెను.

స్వా. ప్రి.:— ముసలితనములో దేవుని స్మరించవచ్చును. ఇప్పుడు అందుకు అవకాశము లేదు అను భావము చెడ్డది. చిన్నతనములో చేయగలిగిన పని పెద్దతనములో చేయలేము. తాజాపుష్పమే దేవుని పూజకు అర్హమైనది. వాడినది తగదు. ఇందుకు ప్రహ్లాదుని ఆదర్శము గుర్తుంచుకొనవలెను.

ప్రహ్లాదుడు అయిదారుసంవత్సరముల వయస్సులో నుండగా శుక్రాచార్యుని కుమారులగు శండా, అమర్కుల చెంతకు చదువుకొనుటకు వెళ్ళెను. గురుగృహమున ఇతరదైత్యకుమారులతో కూడ చదువుచుండెను. అతనికి దండనీతి మొదలగు విషయములను గురువులు నేర్పిరి. ప్రారంభమున గురువులు నేర్పిన ఈవిషయములయందు శ్రద్ధాభక్తులు ఉంచి నేర్చుకొనెను. కాని ఈవిషయములు అతనికి రుచికరములు కావు. ఏలనన ఈవిషయములవలన ఆతని మనస్సున "ఇది నాది", "ఇది ఇతరునిది" అను భావములు కలిగెడివి. ఈతప్పుడు బంధనములలో చిక్కుకొనుట అతనికి ఇష్టములేక, గురువులు నేర్పిన విషయములయందు లక్ష్యము ఉంచక అతడు తన మనస్సును ప్రభువునందు— అనగా దైవమునందు లగ్నముచేసెను. సాంసారికసుఖమును తెచ్చునట్టి ఈవిద్యలన్నియు ఆతనికి స్వప్నసమములుగా తోచెను. కావున ఆతడు చదువులో వెనుకబడెను. ఒకరోజున సహాధ్యాయులు అడిగిరి. "తమ్ముడా, ప్రహ్లాదుడా! ఈదుధ్య నీవు ఇంత విచారముగా ఎందుకు కన్పట్టుచున్నావు? మహారాజకుమారునకు లభించని వస్తువు ఏమి కలదు? నీవు బుద్ధిమంతుడవు. నీకు రాని విద్య [illegible] నేర్పిన [illegible]

నేర్చుకొనెడివాడవు. ఇప్పుడు ఇట్లు అయిపోవుటకు కారణమేమి? నీకు ఏమైన చింత ఉన్నచో మాకు చెప్పుము. మాకు చేతనైనది చేసెదము."

ప్రహ్లాదుడు ఇట్లు సమాధానము చెప్పెను. "సర్వకళ్యాణకరుడగు ప్రభువునందు నామనస్సు లగ్నమయి ఉండుటచే ఆయనయందు తప్ప మరి ఏవస్తువునందును నామనస్సు లగ్నమగుట లేదు. సోదరులారా! ఈవిద్యలు వ్యర్థము. వానియందు నశ్వరపదార్థములే చర్చించబడును. ఈవిద్యలు ఉదరపోషణమునకే ఉపయోగపడును. పరిణామమందు జన్మ, మరణములనెడు మహాదుఃఖములను కలిగించును. జన్మమును పొందినందున ధర్మమును తెలిసికొని, ఈమిథ్యాప్రపంచమునుండి ముక్తిని పొంది ప్రభుని దర్శించుటకు ఉపయోగించు విద్యయే సరియగు విద్య. ఈవిచారమునందే నేను ఎల్లప్పుడును నిమగ్నుడనయి ఉన్నాను. ఇక నాకు సాంసారికపదార్థములనుగురించి చింత ఎట్లు కలుగును? సోదరులారా! మానవజన్మము అత్యంత దుర్లభము. దానిని వ్యర్థముగా పోనిచ్చుట ప్రయోజనకరముకాదు.

*కౌమార ఆచరేత్ ప్రాజ్ఞో ధర్మాన్ భాగవతానిహ ।*
*దుర్లభం మానుషం జన్మ తదప్యధ్రువమర్థదమ్ ॥*

"బుద్ధిమంతుడు బాల్యమునుండియును ధర్మమును పాలించవలెను. ఏలనన, ఈశరీరము అనిత్యమయినను దుర్లభము. ఇదియే పురుషార్థమును ఇచ్చును." విషయసుఖమునందు మునిగియుండి తప్పుడుమార్గమున నీచుడు తన ఆయువును వ్యర్థముచేయరాదు. ఏలనన, ఒకమారు విషయమున చిక్కుపడినచో దానినుండి బయటకు వచ్చుట కష్టము."

"సోదరులారా !

*కో(గ్వ)హేషు పుమాన్ సక్తమాత్మానమజితేన్ద్రియః ।*
*స్నేహపాశైర్దృఢైర్బద్ధముత్సహేత విమోచితుమ్ ॥*

ఇంద్రియములను ఎవడు జయించలేడో ఆతడు గృహాదుల యందు బలవత్తరమైన స్నేహపాశములచే కట్టబడిన తన ఆత్మను వాటి నుండి ఎట్లు తప్పించగలడు?"

"ప్రాణముకంటెను మిక్కిలి ప్రియమగు ధనమును చోరులు, నౌకరులు, వ్యాపారస్థులు తమ ప్రాణములనుకూడ లక్ష్యముచేయక సంపాదించెదరు. ఆధనమునందలి తృష్ణను ఎవడు విడువగలడు? కొడుకులు, కూతుళ్ళు, తల్లిదండ్రులు, సుందరభవనములు, మంచి జీవనోపాయము, పశువులు, నౌకరులు మొదలగునవి సంపాదించినను స్నేహబద్ధమగు లోభముచే కలుగు తృష్ణకు అంతు ఉండదు. ఇంద్రియ ఆసందముమాత్రమే గొప్పదిగా తలచుచు అంతులేని మోహమున మానవుడు వానియందు మునిగిపోవును. కోశస్థమగుపురుగు తనగృహమును నిర్మించుకొని లోపల ఉండిపోవును. బైటికి వచ్చుమార్గముకూడ ఉంచుకొనదు. అటులనే మానవుడు స్త్రీసంగమున ఉండగలుగు మనోహరమైన ఊహాలను ఎట్లు విడువగలడు? స్నేహితులను, ముద్దుబిడ్డలను ఎట్లు విడువగలడు? వైరాగ్యము ఎట్లు కలుగును? ఇట్లు మైమరచిన వాడు కుటుంబకార్యములయందు నైచ్యమునకు పాలగును. ఆయుష్యము పూర్తిఅయినను పురుషార్థమును పొందడు. కుటుంబమునందు మోహము కలవారు సర్వకాల సర్వావస్థలయందును త్రివిధతాపములచే దుఃఖించెదరు. అయినను దానిని దుఃఖముగా తలచరు. నిరంతరము ధర్మమునందు మనస్సును లగ్నముచేయువాడు, పరధనమును హరించువాడు ఈలోకమునందును, పరలోకమునందును దుఃఖమును పొందుననియు, ధనసంపాదనముచే అనేక అనర్థములు కలుగుననియు తలచును."

"ఓ దైత్యకుమారులారా! మానవుడు తనకును ఇతరునకును భేదము కలగను భావముతో కుటుంబపోషణము చేయుచున్నంత

కాలము ఆత్మవిచారము చేయుటకు సమర్థుడు కాజాలడు. మూఢుని వలె అహంకార మమకారములకు లోనగును."

"బంధించబడిన కోతివలె దారాపుత్రాదుల బంధనములచే బద్ధుడగు నరుడు ఏకాలమునందును ఎట్టిపరిస్థితియందును కూడ ఆత్మకు విముక్తి కలిగించ సమర్థుడుకాడు. కావున విషయభోగములను త్యజించి, దైత్యులతో సంగమును త్యజించి నారాయణుని భజించుడు. నిస్సంగుడగు నరుడు నారాయణుని భజించిన మోక్షము కలుగును. శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి, సర్వహితకరుడు, ప్రియమిత్రుడు. ఆయనను శరణుజొచ్చుట మంచిది. భగవద్భజనమును, సేవను త్యజించి ఆయుష్యమును వ్యర్థముగా గడపుటయును, విషయ సుఖమున మగ్నులగుటయును నిరుపయోగము. బంధువులారా! శరీర ధారణచే విషయసుఖము ఎల్లప్రాణులకును కలుగును. కావున విషయ సుఖమునకు అధికముగ ప్రయత్నము చేయనవసరములేదు. మానవ జన్మము నెత్తినందున శరీరమునందు శక్తి కలిగియున్నంతకాలము, సామర్థ్యము ఉన్నంతకాలము బుద్ధిమంతుడు ఆత్మకళ్యాణముకొరకు ప్రయత్నించవలెను. మీరు హృదయాంతర్వర్తియగు భగవానుని భజించుడు."

"అహంకార, మమకారములకు స్థానమగు శరీరము తనది కాదు. సంతానము, భార్య, గృహము, బంధువులు, శరీరభిన్నములగు మమత్వ ప్రధానములగు పదార్థములు ఇతగునివి అనుటలో సందేహమేమి? ఆశ్చర్యమేమి?"

"స్థావర జంగమాత్మకమగు పదార్థములయందు పరమాత్మ యొక్కడే ఉన్నాడు. అతడు నామరూపాద్యుపాధి రహితుడు. అయినను తన మాయాశక్తిచే తానే వివిధరూపములను ధరించును. పరమాత్ముని వాస్తవస్వరూపము కేవలము సచ్చిదానందస్వరూపము.

ఇట్టి ప్రభువును పొందుటకు మీరు అసురభావమును త్యజించి ప్రాణులందరిపైనను దయ కలిగియుండుడు. ఏలనన ప్రాణులన్నిటియందును దయకలిగి యుండుటచే సర్వాంతరాత్మయగు పరమేశ్వరుడు ప్రసన్నుడగును.

శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్।

మీరుకూడ నేను చెప్పినట్లు శ్రద్ధతో మెలగినచో మీకుకూడ జ్ఞానము కలుగును. శ్రద్ధతో నాకు కలిగిన తత్త్వజ్ఞానమే స్త్రీలకును, బాలకులకునుకూడ కలుగును."

"జీవుడు జన్మించును, బ్రతుకును, పెరుగును, వికాసముచెందును, క్షీణించును, నశించును. ఈ ఆరు వికారములును వృక్షము యొక్క అస్తిత్వముచే ఫలమునందు కలుగునట్లు ఆత్మయొక్క అస్తిత్వముచే దేహమునందు కలుగును. కాని ఈ ఆరువికారములును ఆత్మకు కలుగవు. ఏలనన ఆత్మ నిత్యము. ఆత్మ ఒకటే. దేహములు అనేకములు. ఆత్మ దేహాదుల ద్రష్ట. దేహము జడము, దృశ్యము. ఆత్మ నిర్వికారము. దేహము సవికారము. ఆత్మ స్వయంప్రకాశము. దేహమే పరప్రకాశ్యము. ఆత్మ సర్వకారణము. దేహము కార్యమూర్తి. ఆత్మ వ్యాపకము. దేహము ప్రదేశమాత్రమున ఉండును. ఆత్మ నిస్సంగము. దేహము సంగయుక్తము. ఆత్మను ఆచ్ఛాదించునవి ఏమియును లేవు. శరీరమును వస్త్రాదులు ఆచ్ఛాదించును. ఇట్టి ఆత్మలక్షణములను తెలిసికొని, జ్ఞానమును పొంది దేహాదులయందు "నేను, నాది" అను మోహజన్యమగు మిథ్యాభావమును త్యజించుడు."

"నిధియందలి రాళ్ళను అగ్నియందు కాల్చుట మొదలగు ఉపాయములద్వారా బంగారమును విడదీసినట్లు వివేకి దేహము అనెడు

క్షేత్రమునుండి ఆత్మప్రాప్తి అనెడు ఉపాయముద్వారా బ్రహ్మమును పరిశోధించి తెలిసికొనగలడు.”

“మాయ, మహత్తత్త్వము,అహంకారము, శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అనెడు ఈఎనిమిదియును ప్రకృతులని చెప్పబడును.సత్త్వ, రజ, స్తమోగుణములు మాయయొక్క మూడు గుణములు. ఏకాదశేంద్రియములు, పంచభూతములును కలసి 16 వికాములు అగును. 8 ప్రకృతులు, 16 వికారములును కలసి 24 తత్త్వములగును. వానియందు ఒకే ఆత్మ సాక్షిరూపమున ఉండును.”

“నేతి, నేతి” “ఇది ఆత్మకాదు.ఇదిఆత్మకాదు.” అని అన్నిజడ పదార్థములను త్యజించిన అనంతరము మిగిలిన చైతన్యమే సత్యమగు ఆత్మఅని తెలిసికొనుము. “జాగ్రత్,స్వప్న,సుషుప్తి” అనెడు మూడు వృత్తులును అనగా అవస్థలు బుద్ధికి సంబంధించినవి. ఈమూడు వృత్తులును వేనిద్వారా అనుభవించబడుచున్నవో అతడు సర్వసాక్షియు, పరాత్పరుడును అగు పరమాత్మ అని తెలిసికొనుము.”

“ఇట్లు ఆత్మస్వరూపమును తెలిసికొనుము. సంసారమునకు కూడ ద్వారము బుద్ధియే. సంసారముకూడ బుద్ధియొక్క గుణకర్మల చేతనే నిర్మించబడినది. అవి అజ్ఞానమూలకములగుటచే మిథ్య అయినను మనుష్యునకు స్వప్నమువలె సత్యముగా కన్పట్టును. ఇవిఅన్నియును దేనియందు ప్రతీతములగునో, ఏది అధిష్ఠానమో, ఆబ్రహ్మమును తెలిసికొని సంసారబీజమగు అవిద్యను నశింపజేసి, నిరతిశయ సుఖస్వరూపమగు పరబ్రహ్మమునే పొందుట ఉత్తమపురుషార్థము. అందే మానవజన్మము సార్థకమగును.”

ఇట్లు ప్రహ్లాదుడు తన సహాధ్యాయులకు ఉపదేశించెను. ఈసంగతి గురువులకు తెలిసి ఏకాంతమున ప్రహ్లాదునకు ఇట్లు చెప్పిరి. “నాయనా, ప్రహ్లాదా!నీకు కళ్యాణము అగుగాక. నిజము చెప్పుము.

ఇతరబాలకుల మనస్సులలో మార్పులు కలుగకుండ నీమనస్సులో మార్పులు ఎట్లు కలిగినవి? నీబుద్ధిని ఎవరైన మార్చివేసిరా? లేక నీవే మార్చివేసికొనినావా?"

ప్రహ్లాదుడు:—రెండును నిజమే.

*స ఏవ ఆత్మా స్వపరేత్యబుద్ధిభిర్దురత్యయానుక్రమణో నిరూప్యతే ।*
*ముహ్యన్తి యద్వర్త్మని వేదవాదినో బ్రహ్మదయో హ్యేష భినత్తి మే మతిమ్ ॥*

*యథా భ్రామ్యత్యయో బ్రహ్మన్ స్వయమాకర్షసన్నిధౌ ।*
*తథా మే భిద్యతే చేతః చక్రపాణేర్యదృచ్ఛయా॥*

"ఎవరిని వర్ణించుట శక్యముకాదో, ఎవరిని వెదకుటకు బ్రహ్మాదులుకూడ తప్పుడుదారులను పట్టెదరో, ఆపరమాత్మని అవివేకులు స్వ, పరభేదములతో వివరించెదరు. ఆపరమాత్ముడే నాబుద్ధిని మార్చెను. ఓబ్రాహ్మణులారా! సూదంటురాయి సమీపమునకు ఇనుము ఆకర్షించబడినట్లు భగవంతుని సమీపమునకు నామనస్సు ఆకర్షించబడుచున్నది. భగవానుని సామీప్యము నాకు ఏలకావలెను అనునది నేను ఎరుగను." ఇట్లు పలికి ప్రహ్లాదుడు ఊరకుండెను.

ఈకారణములచే భగవంతుని భజించువారు బాల్యమునుండియును భజించుట యుక్తము. వార్ధక్యమునందు ఏమియు చేయలేము. భర్తృహరి వాక్యమును వినుడు.

*యావత్స్వస్థమిదం కళేబరగృహం యావచ్చ దూరే జరా*
*యావచ్చేన్ద్రియశక్తిరప్రతిహతా యావత్ క్షయో నాయుషః ।*
*ఆత్మశ్రేయసి తావదేవ విదుషా కార్యః ప్రయత్నో మహాన్*
*ప్రోద్దీప్తే భవనే చ కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః॥*

"ఈశరీరమను గృహము ఆరోగ్యముగా నున్నంతకాలమే, వార్ధక్యము చెంతకు రానంతవరకునూ రాత్రిమే, ఇంద్రియసామర్థ్యము

క్షీణించనంతవరకుమాత్రమే అనగా గ్రుడ్డి, కుంటి, మూగ మొదలగు లక్షణములు రానంతవరకుమాత్రమే,మృత్యువు సమీపించనంత వరకుమాత్రమే ఆత్మకళ్యాణమునకు మానవుడు ప్రయత్నించవలెను. ఎవరైన, వార్ధక్యములో మోక్షముకొరకు ప్రయత్నించవచ్చును అని అనుకొనినచో అది ఇంటికి నిప్పు అంటుకొనినతరువాత నుయ్యి ప్రయత్నముచేయుటవంటిదే.

అంతట ఆలస్యము అగుటచే అందరును నిద్రించుటకు వెళ్ళిరి.